క్లుప్తంగా

నేడు వాహనాల వేలం

మదనపల్లె : ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాల్లో సీజ్‌చేసిన వాహనాలను మదనపల్లె ఎస్‌ఈబీ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం బహిరంగ వేలం వేయనున్నట్లు ఇన్‌చార్జ్ సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు జిల్లా ఎస్‌ఈబీ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సమక్షంలో బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు దరఖాస్తు రుసుం చెల్లించి వేలంలో పాల్గొనవలసిందిగా కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

తంబళ్లపల్లె: మండల కేంద్రంలోని గిరిజన బాలుర సంక్షేమ పాఠశాలలో 3–9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కన్నయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు ఈ నెల 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫారాలను నేరుగా పాఠశాలలో అందజేయాలన్నారు.

నృత్య ప్రదర్శనకు సత్కారం



నృత్య ప్రదర్శన చేస్తున్న హరిత బృందం

పీలేరు : పీలేరుకు చెందిన శ్రీ నటరాజ కళా మందిర్ నిర్వాహకురాలు హరిత నృత్య ప్రదర్శనకు ఘన సత్కారం లభించింది. తిరుపతి మహతి ఆడిటోరియంలో జరిగిన తెలుగు తల్లి ఆరాధానోత్సవాల్లో హరిత తన శిష్యులతో కలసి తెలుగుతల్లి పాటకు నృత్య ప్రదర్శన చేశారు. నిర్వాహకులు వంశీ కళాక్షేత్రవారు హరిత బృందాన్ని జ్ఞాపకలు, దుశ్శాలువలతో సత్కరించారు.

నాటుసారా స్వాధీనం

పెద్దమండ్యం: నాటుసారా స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. మండలంలోని రామానాయక్‌తండా పంచాయతీలోని బండకిందతండాలో నాటుసారా తయారీ, విక్రయాలు జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. దాడుల్లో తండాకు చెందిన వశేనాయక్ వద్ద 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ఏనుగు మల్లమ్మ ఉత్సవాలు ప్రారంభం

బి.కొత్తకోట: పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై వెలసిన ఏనుగు మల్లమ్మ ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు జరిపి ఉత్సవ వేడుకలను ప్రారంభించారు. ఏనుగు మల్లమ్మ విగ్రహానికి వివిధరకాల పూలతో విశేష అలంకరణలు చేశారు. పంచామృత అభిషేకాలు నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో హాజరై దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మదనపల్లె సిటీ: వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని హాకీ సీనియర్ కోచ్‌లు ప్రసాద్‌రెడ్డి, నౌషాద్ అన్నారు. ఆదివారం స్థానిక బీటీ కాలేజీ మైదానంలో జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ ఆధ్వర్యం జరిగిన హాకీ శిక్షణ శిబిరం క్రీడాకారులకు దీక్ష పాఠశాల అల్పాహారం అందించారు. వారు మాట్లాడుతూ శిక్షణా శిబిరం ఉదయం, సాయంత్రం ప్రత్యేక మెళుకువలు నేర్పించబడుతుందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వంశీ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

కనుమలో గంగమ్మకు బోనాలు సమర్పణ

మదనపల్లె : పట్టణంలోని 12వ వార్డు బసినికొండ రిలయన్స్ పెట్రోల్‌బంక్, వడ్డిపల్లె ప్రాంతాల్లో గంగజాతరను పురస్కరించుకుని ఆదివారం కనుమలో గంగమ్మకు మహిళలు దీలు, బోనాలు సమర్పించారు. డప్పులు, మేళతాళాలతో బసినికొండ ప్రాంతానికి చెందిన మహిళలు దీలు, బోనాలు తలపై మోస్తూ రెండు కిలోమీటర్ల దూరంలోని కనుమలో గంగమ్మ గుడికి పాదయాత్రగా బయలుదేరారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై కనుమలో గంగమ్మను దర్శించుకున్నారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు . కార్యక్రమంలో లక్ష్మణ్‌రెడ్డి, సురేష్, శంకర, మహేష్, బాబు, హరి, సుబ్రహ్మణ్యం, అంజి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేయాలి

మదనపల్లె సిటీ: రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అమరావతి అన్నారు. ఆదివారం మాతృదినోత్సవం పురస్కరించుకుని వెల్‌విషర్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం జరిగింది. ఆమె మాట్లాడుతూ రక్తదానం చేయడంలో అపోహలు పెట్టుకోరాదన్నారు. రక్తదానం చేయడం వల్ల పలువురికి ప్రాణాలు కాపాడివారమవుతామన్నారు. 40 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో వెల్‌విషర్స్ వ్యవస్థాపకులు గిరీష్, సభ్యులు హరిబాబు, అరుణ్, గిరీష్,మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

రామభక్త హనుమాన్‌కీ జై

- వాడవాడలా హనుమజ్జయంతి వేడుకలు
- పలు ఆలయాల్లో అన్నదానం, మజ్జిగ వితరణ
- అంజన్న సేవలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా



కురబలకోట: అభయాంజనేయ విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు,



మదనపల్లె : ప్రసన్నాంజనేయస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : అంజనీపుత్రుడు, వాయునందనుడు, శ్రీరామ భక్తుడైన హనుమజ్జయంతి వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఆదివారం వేకువజాము నుంచే హనుమాన్ ఆలయాల్లో సందడి మొదలైంది. హనుమజ్జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని వరాల ఆంజనేయస్వామి, రింగ్‌రోడ్డు, కాట్లాటపల్లె శ్రీ ప్రసన్నాంజనేయస్వామి, నీరుగట్టువారిపల్లె రామాలయం, బసినికొండ, సీటీఎంలోని అభయ, ప్రసన్నాంజనేయస్వామి ఆలయాల్లో స్వామివారికి అభిషేకాలు, సింధూరపూత, హోమం, అన్నసంతర్పణ తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. వరాల ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామివారిని వివిధ రకాల పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. హనుమను దర్శించుకున్న భక్తులు స్వామి వైభవం కన్నులపండువగా ఉందని కీర్తించారు. రింగ్‌రోడ్డు, కాట్లాటపల్లెరోడ్డులోని శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయాల్లో స్వామివారిని ఎమ్మెల్యే నవాజ్‌బాషా, చైర్‌పర్సన్ మనూజారెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే, చైర్‌పర్సన్‌ను ఘనంగా సన్మానించి, తీర్థప్రసాదాలు అందజేశారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నవాజ్ బాషా భక్తులకు అన్నదానం చేశారు. పలు ఆలయాల వద్ద ప్రత్యేకంగా భక్తులకు మజ్జిగ, అంబలి వితరణ చేశారు. బసినికొండ పుంగనూరు రోడ్డులోని శ్రీప్రసన్న ఆంజనేయస్వామిగుడిలో నిర్వహించిన ప్రత్యేక పూజలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు ఆలయమర్యాదలతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు డిష్‌రామకృష్ణారెడ్డి, మేస్త్రీశ్రీనివాసులు, ఈశ్వర్‌నాయక్, రామిశెట్టిశివయ్య, ఎస్వీ. రమణ, వసీం, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులు, సర్పంచ్ శరత్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు బండిమనోహర్, శీలంరమేష్, దండురామాంజులు, లక్ష్మీనారాయణ, మునిశేఖర్, సదాశివ రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, జాన్‌బాబు, బావాజాన్, రహీం తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రంలో..

రామసముద్రం : మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ఆదివారం ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఎలకపల్లె గ్రామంలో వెలసిన శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి నిర్వహించారు. గ్రామానికి చెందిన మంజునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు హనుమాన్ చాలీసా ద్వాదశక్షర మంత్రం, అష్టోత్తరలతో పూజలు చేశారు. అలాగే రామభజన కీర్తనలతో భక్తులు,కళాకారులు రామకోటి జపించారు. అర్చకులు శంకరచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు, తమలపాకు అలంకరణ, వడమాల సేవలు నిర్వహించారు. రామసముద్రం బజారువీధిలో వెలసిన వీరాంజనేయస్వామికి ఆలయ అర్చకులు కులశేఖర్ భట్టర్ ప్రత్యేక పూజలు చేశారు.

గుర్రంకొండలో..

గుర్రంకొండ: మండలంలోని గుర్రంకొండ, ఎగువ అమిలేపల్లె, మామిళ్లవారిపల్లె,టి. పసలవాండ్లపల్లె, తరిగొండ గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం ఆయా గ్రామాల్లోని స్వామి వారి ఆలయాల్లో వేకువ జామునే స్వామివారికి పలురకాల నైవేద్యాలు సమర్పించారు. పలు రకాల పండ్లు,స్వీట్లు,వడలతో అలంకరించి మాలలు వేశారు. పలువోట్ల తమలపాకులతో ఆకుపూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు కిరణ్‌కుమార్ శర్మ, ఉమ్మన్నస్వామి, జీవన్, నిర్వాహకులు పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో..

పెద్దతిప్పసముద్రం: స్థానిక శ్రీ పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం జరిగిన హనుమాన్ జయంతి వేడుకలను కన్నుల పండుగగా నిర్వహించారు. ఆలయం సేవకులు సనగరం పట్టాభిరామయ్య, ఆకుల మల్లికార్జునల ఆధ్వర్యంలో ఉదయం నుంచి ఆలయంలో గణపతి పూజ, మన్యుసూక్త సహిత మృత్యుంజయ హోమం, పుణ్యావచనం, పంచామృతాభిషేకం, మన్యుసూక్త పూర్వక తేనెతో అభిషేకం, రామతారక హోమం, రుద్రహోమం, పూర్ణాహుతి, ఆకు పూజ కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు స్వామి వారి తీర్థ ప్రాదాలను స్వీకరించారు. అనంతరం సాయంత్రం హనుమాన్ ప్రతిమను ప్రత్యేకంగా అలంకరించి నిర్వహించిన శోభా యాత్రకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

పీలేరులో..

పీలేరు రూరల్ : హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక యర్రమరెడ్డి గుట్టలోని శ్రీ అభయహస్త ఆంజనేయస్వామి ఆలయంలో విశేషంగా పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం, వడపూజ, ఆకుపూజ, హోమం నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఊరేగింపు మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఎ.టి.సుజాత ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిపించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అలాగే స్థానిక సదుం మార్గంలోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలోనూ హనుమజ్జయంతి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు అశోక్ కుమార్, రాజుస్వామి పాల్గొన్నారు.

నిమ్మనపల్లెలో..

నిమ్మనపల్లె : మండల పరిధిలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రమైన నిమ్మనపల్లె, పెద్దమాదిగపల్లె గ్రామాల్లోని అభయాంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ద్వాదషాక్షరమంత్రం, హనుమాన్‌చాలీసా, అష్టోత్తరములతో హనుమంతుని ఆరాధన చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతోపాటూ అన్నదానం చేశారు. మజ్జిగ వితరణ చేశారు. ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె: మండలంలోని కన్నెమడుగు పంచాయతీ మరిమిరెడ్డిగారిపల్లె బస్టాప్‌లో వెలసిన శ్రీఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం మరిమిరెడ్డిగారిపల్లె, కొత్తకురవపల్లె గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో హనుమజయంతిని ఘనంగా జరుపుకున్నారు. స్వామికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్తుల సహకారంతోభక్తులకు పెద్ద ఎత్తున అన్నసంతర్పణ చేశారు.

వాల్మీకిపురంలో..

వాల్మీకిపురం: పట్టణ పొలిమేర్లలో వెలసిన శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి అభిషేకం, ఆకు పూజ, వడమాల సమర్పణ, కస్తూరి పూజ తదితర కార్యక్రమాలను వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ కన్నుల పండువగా నిర్వహించారు. అంతకు ముందు తిరుచ్చిపై అధిరోహించిన శ్రీ వీరాంజనేయస్వామి వారు తిరుమాఢ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శన భాగం కల్పించారు. అలాగే ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీ ఆంజనేయస్వామి వారి ఆలయంలో విశేష పూజలతో పాటు అన్నదాన కార్యక్రమం, పుష్పపల్లకీలో స్వామివారి ఊరేగింపు కార్యక్రమాలు జరిగాయి.

కురబలకోటలో..

కురబలకోట: మండలంలోని గౌనివారిపల్లె వద్ద వెలసిన భారీ అంజనేయ విగ్రహం వద్ద హనుమాన్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తారు. విగ్రహ కమిటీ నాయకులు లూబీ విశ్వనాథ్, నంద కుమార్ ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాలతో పాటు అన్న సంతర్పన ఏర్పాటు చేశారు. జెడ్పీటీసీ బైసాని జ్యోతి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్ రెడ్డి, కురబలకోట రాజశేఖర్, శెట్టి భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



మదనపల్లె: ప్రత్యేక అలంకరణలో వరాల ఆంజనేయస్వామి



గుర్రంకొండ: మామిళ్లవారిపల్లెలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ



రామసముద్రం: రామభజనలు చేస్తున్న కళాకారులు, భక్తులు



పీలేరు రూరల్: అభయ ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా గర్నిమిట్ట యల్లమ్మ జాతర



బోనాలు తెస్తున్న చింతమాకులపల్లె నాయునివారు

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో వెలసిన గ్రామ దేవత శ్రీ యల్లమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. యల్లమ్మ జాతరలో భాగంగా ఆదివారం అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి విశేషాలంకరణ గావించి పుష్పపల్లకీలో ఉంచి గ్రామంలో మంగళ వాయిద్యాల మధ్య ఘనంగా ఊరేగించారు. అనంతరం మండలంలోని చింతమాకులపల్లెకు చెందిన నాయునివారు మొదట అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నాయునివారు తొలి బోనం సమర్పించిన అనంతరమే మిగిలిన వారందరూ బోణాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఆదివారం సాయంత్రం గర్నిమిట్టతోపాటు కేవీపల్లె, చింతమాకులపల్లె పరిసర గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున బోణాలు ఊరేగింపుగా తీసువచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామానికి చెందిన గుడి రమణ కుటుంబ సభ్యులు అమ్మవారికి రూ. 2 లక్షల విలువైన వెండికిరీటం బహుకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ రామ సుబ్బమ్మ, జెడ్పీటీసీ గజ్జెల శృతి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అంతర్ పంటలతో అధిక ఆదాయం



పకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న మధ్యప్రదేశ్ రాష్ట్ర మహిళా బృందం

వాల్మీకిపురం: ప్రకృతి వ్యవసాయ సాగులో అంతర్ పంటలు సాగు చేయడం వలన దిగుబడితో పాటు అధిక ఆదాయం పొందవచ్చునని రైతు సాధికార సంస్థ రాష్ట్ర ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ రాజేష్, వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ యశోదమ్మ అన్నారు. ఆదివారం మండలంలోని చింతపర్తిలో సాగు చేసిన ప్రకృతి వ్యవసాయ సాగును మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 30 మంది మహిళా రైతుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా మహిళా బృందం సభ్యులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ ప్రకృతి సాగులో 30 రకాల అంతర్ పంటల సాగు వలన నిత్యం నాణ్యమైన దిగుబడులతో పాటు అధిక ఆదాయం పొంద వచ్చునని సూచించారు. భూమి పైన జీవ వైవిధ్యం, భూమి లోపల రకరకాల వేరు వ్యవస్థ ద్వారా అనేక రకాల సూక్ష్మజీవులు ఉత్పన్నమౌతాయని, తద్వారా మొక్కకు కావాల్సిన పోషకాలు సంవృద్ధిగా అందుతాయని వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది స్వాతి, శ్రీనివాసులు, పెద్ద రెడ్డెయ్య, రెడ్డిబాష, హేమలత, హరినాథ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ

పీలేరు : మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని బిస్మిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు బోదేషావలి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. ఆదివారం బోదేషావలి తన తల్లి హసీనాబీ జ్ఞాపకార్థం సుమారు 200 మందికి పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జన్మనిచ్చిన తల్లిని పూజించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ మంజుల, శ్రీనివాసులురెడ్డి, చాందిని, ఆటో డ్రైవర్లు షాహుల్, అబీద్, ముబారక్, రెడ్డి రామాచారి తదితరులు పాల్గొన్నారు.

గాండ్ల విద్యార్థులకు ప్రోత్సాహకాలు

మదనపల్లె : అఖిల గాండ్ల తెలికుల సంక్షేమసంఘం ఆధ్వర్యంలో పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచి అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు గ్రోసు గోపాలయ్య మెమోరియల్ గోల్డ్ మెడల్‌తో పాటుగా ప్రోత్సాహక, సరిఫికెట్లు అందిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షులు బండపల్లి వెంకటరమణ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో అధిక మార్కులు సాధించిన గాండ్ల విద్యార్థులు ఈనెల 22వ తేదీలోపు మార్కుల వివరాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతి జిల్లాలో పదోతరగతి, సీనియర్ ఇంటర్మీడియట్ టాపర్లలో ఒకరికి గోల్డ్‌మెడల్, నగదు ప్రోత్సాహకం, మెరిట్ సర్టిఫికెట్ అందిస్తామన్నారు. ముగ్గురికి మెరిట్ సర్టిఫికెట్‌లు, మొమెంటోలు ప్రదానం చేస్తామన్నారు. జూన్ 4 ఆదివారం నెల్లూరులో జరిగే అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక వర్గ సమావేశంలో బహుమతి ప్రదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన గాండ్ల విద్యార్థులు తమ దరఖాస్తులను జిల్లా అధ్యక్షులు బండపల్లి వెంకటరమణ వద్దకు చేర్చాలన్నారు.

లోక్‌అదాలత్‌లో 109 కేసుల పరిష్కారం



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి హసీపాసుల్తానా

తంబళ్లపల్లె: స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో ఇన్‌చార్జ్ న్యాయమూర్తి హసీపాసుల్తానా ఆధ్వర్యంలో జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమం శనివారం రాత్రి 9గంటల వరకు జరిగింది. కక్షిదారులు ఇరువర్గాల రాజీమేరకు 109 కేసులు పరిష్కరించినట్లు న్యాయమూర్తి తెలిపారు. పై కేసులకు సంబంధించి రూ.15,29051లు రికవరీ చేసి సంబంధిత బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యవిధానపరిషత్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు వెంకటరామయ్య ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి పలు రకాల వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

ఖతీబ్‌ల సమస్యలు పరిష్కరిస్తాం

గుర్రంకొండ: పట్టణంలో నెలకొన్న ఖతీబ్ వంశస్తుల సమస్యలను పరిష్కరిస్తామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, ఖతీబ్ కమిటీ గౌరవాధ్యక్షులు అఘామొహిద్దీన్ అన్నారు. ఆదివారం గుర్రంకొండలో ఖతీబ్ కమిటీ సమావేశం నిర్వహించి సమస్యలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పూర్వం నుంచి రంజాన్, బక్రీద్ పండుగల రోజున ఈద్గాల వద్ద ఖతీబ్ వంశస్తులే అన్ని ఏర్పాట్లు చేసేవారన్నారు. ఇందుకోసం నవాబుల కాలంలో వీరికి కొంత ఖతీబ్ మాన్యం భూములు అప్పట్లో ఇచ్చారన్నారు. ప్రస్తుతం ఈభూములను కబ్జాచేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. శ్రీరాములు అనే వ్యక్తి పేరుమీద వందలాది ఎకరాల ఖతీబ్ భూములు ఆన్‌లైన్‌లో ఉన్నాయన్నారు. ఇవి ఉద్దేశ పూర్వకంగానే చేశారన్నారు. ఈసమస్యను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఖతీబ్ కమిటీ అధ్యక్షుడు ముస్తాఫా, ఉపాధ్యక్షుడు గయాజ్ అహ్మద్, సభ్యులు కలీమ్, అమీర్‌జాన్, షామీర్, సాధిక్‌లు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను గౌరవించాలి

వాల్మీకిపురం: విద్యార్థులు చిన్న వయస్సు నుంచే తల్లిదండ్రులను గౌరవించడం నేర్చుకోవాలని స్థానిక గ్రంథాలయ అధికారి రమాపతి అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో జరిగిన వేసవి శిక్షణ శిబిరంలో మాతృదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు యామని, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ సుప్రియలకు శాలువ కప్పి సన్మానించారు. అనంతరం రమాపతి మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయస్సు నుంచే మాతృమూర్తులను గౌరవించడం నేర్చుకోవడంతో పాటు క్రమశిక్షణతో వారు చెప్పే మాటలను విన్నప్పుడే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో తల్లులు రాధ, భువనేశ్వరి, యశోదమ్మ, కళ్యాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

పుంజుకుంటున్న టమాటా ధరలు

- మార్కెట్లో కిలో టమాటా రూ.14
- బయట ప్రాంతాల్లో ఎండలకు తగ్గుతున్న దిగుబడులు



రవాణాకు సిద్ధంగా ఉంచిన టమాటాలు

గుర్రంకొండ: టమాటా ధరలు మార్కెట్లో పుంజుకొన్నాయి. వారం రోజుల క్రితం ధరలతో పోల్చితే 50 శాతం ధరలు అధికంగా పెరిగాయి. మార్కెట్లో కిలో టమాటా ధరలు రూ.14 వరకు పలుకుతున్నాయి. బయటరాష్ట్రాల వ్యాపారుల రాకతో టామాటా ధరలు పెరిగాయి. బయట ప్రాంతాల్లో ప్రస్తుత ఎండలకు టమాటా దిగుబడులు తగ్గిపోతున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో పండించిన టమాటాలకు గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయని వ్యాపార వర్గాలు అంటున్నాయి. నియోజకవర్గ పరిధిలోని పీలేరు. కలికిరి, వాల్మీకీపురం మార్కెట్‌యార్డు పరిధిలోని మండలాల్లో ప్రస్తుతం 10560 ఎకరాల్లో టమాటా పంట దిగుబడి వస్తోంది.

ప్రస్తుత పంట దిగుబడి

నియోజకవర్గంలోని మూడు మార్కెట్ కమిటీ యార్డు పరిధిల్లో ప్రతి ఏడాది ఈసీజన్‌లో 10వేల నుంచి 1056 ఎకరాల్లో టమాటా పంట దిగుబడి వస్తోంది. ఈసీజన్‌లోనే ఈప్రాంతంలో ఎక్కువగా టమాటా పంట సాగుచేస్తుంటారు. వేసవి కాలంలో అన్ని ప్రాంతాల కంటే పడమటి ప్రాంతాల వాతావరణమే టమాటా సాగుకు కొంతమేరకు అనుకూలంగా ఉంటుంది. దీంతో రైతులు టమాటా పంట అధికంగా సాగుచేస్తుంటారు.

పెరిగిన ధరలు

గత వారం రోజులుగా టమటా ధరలు భారీగా పంజుకొన్నాయి. వారం రోజులు కిందట 30 కేజిల టమాటా క్రేట్ ధరలు అత్యధికంగా రూ.175 లోపే ఉన్నాయి. అయితే ప్రస్తుతం ఒక క్రేట్ ధర రూ. 320 నుంచి రూ.350 వరకు ధరలు పలుకుతున్నాయి. వారం రోజులుగా మార్కెట్లో టమాటా ధరలు నిలకడగా పెరుగుతుండడం గమనార్హం. మన రాష్ట్రంతో పాటు బయట రాష్ట్రాల్లో కూడా ఎక్కువగా టమాటా పంటలు సాగు చేయడంతో అధిక దిగుబడులు కారణంగా ధరలు పుంజుకోలేదు. ఏపీ రాష్ట్రాల్లో అక్కడే స్థానికంగా టమాటా దిగుబడులు అక్కడి మార్కెట్లో అందుబాటులోకి వచ్చాయి. దీంతో గత రెండునెలలుగా ధరలు పుంజుకోలేదు.

బయట ప్రాంతాల్లో దెబ్బతిన్న తోటలు

రాయలసీమతో పాటు బయట రాష్ట్రాల్లో ప్రస్తుత వేసవి ఎండలకు టమాటా తోటలు దెబ్బతిన్నాయి. దీంతో అక్కడ టమాటా దిగుబడులు రోజు రోజుకు తగ్గిపోతున్నాయి. ఈనేపథ్యంలో ఈ ప్రాంతంలో పండించే టమాటాలకు ధరలు వస్తున్నాయి. వేసవి కాలంలో ఎంతో కొంత టమాటా పంట దిగుబడి వచ్చేది పడమటి ప్రాంతాలే కావడం గమనార్హం. దీంతో ఇప్పుడిప్పుడే మార్కెట్లో టమాటా ధరలు పుంజుకొంటున్నాయి.


బయట రాష్ట్రాల వ్యాపారుల రాక

నియోజకవర్గంలోని మూడు మార్కెట్‌యార్డుల పరిధిలో ప్రస్తుతం గత వారం రోజులుగా తమిళనాడు, ఒరిస్సా, పశ్చిమబెంగాల్, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు ఇక్కడికి వస్తున్నారు. ప్రతిరోజు ఇక్కడి టమాటాలను కొనుగోలు చేసి వాహనాల ద్వారా బయట ప్రాంతాలకు తరలిస్తున్నారు. బయట రాష్ట్రాల్లో టమాటాల దిగుబడి తగ్గిపోవడంతో వ్యాపారులు ఇక్కడి తరలివస్తుండడం గమనార్హం.

వారం రోజులుగా మార్కెట్లకు వచ్చిన టమాటాల స్టాకు, ధరల వివరాలు

తేదీ	స్టాకు (టన్నుల్లో)	ధరలు (25కేజీల క్రీట్)
08.5.23	872	రూ.175
09.5.23	920	రూ.198
10.5.23	868	రూ.230
11.5.23	908	రూ.240
12.5.23	856	రూ.275
13.5.23	928	రూ.300
14.5.23	875	రూ.350

ధర నిలకడగా ఉండే సూచనలు



వారం రోజులతో పోల్చితే మార్కెట్లో టమాటా ధరలు ప్రస్తుతం పుంజుకొంటున్నాయి. ఇవే ధరలు కొద్దిరోజులు నిలకడగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. బయట ప్రాంతాల్లో ఎండలకు టమాటా పంట దిగుబడి తగ్గిపోతోంది. దీంతో మన ప్రాంతంలో పండించే టమాటాలకు గిట్టుబాటు ధరలు లభించే అవకాశముంది.

– జగదీష్, కార్యదర్శి, వాల్మీకిపురం మార్కెట్ కమిటీ

చౌడేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు

కలకడ : మండల కేంద్రమైన కలకడలో వెలసిన శ్రీచౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలలో భాగంగా శ్రీచౌడేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం దేశాయి కుటుంబ సభ్యులు చౌడేశ్వరిదేవికి ఒడి బియ్యం కట్టి, ఉత్సవాలను ప్రారంభించారు. ఆదివారం ఉదయం అలంకరణ, నైవేద్యం, 8గంటల నుంచి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పణ, కుంకుమ అర్చన, అభికేషాలు, పూజలు చేశారు. 10గంటల నుంచి తొగటవీరక్షత్రులు పలికే ఖడ్గపద్యాలు, ఏటా బోనం సమర్పణ, 4గంటల నుంచి జ్యోతుల తయారీ, 6గంటల నుంచి అమ్మవారి విశిష్టతను డాక్టర్ వెంకటయ్య తెలియజేశారు.